


తేలని అభ్యర్థిత్వాలు.. వీడని ఉత్కంఠ

టికెట్ వేటలో ఆశావహులు

కాంగ్రెస్, బీజేపీల్లో అయోమయం

లష్కర్‌లో వేడెక్కుతున్న రాజకీయాలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రాజకీయాలు దినదినానికి ఆసక్తికరంగా మారుతున్నాయి. బీఆర్ఎస్‌కు ప్రత్యర్థి పార్టీలుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థిత్వాలు నేటికీ ఖరారు కాలేదు. దరిమిలా ఇరు పార్టీల నాయకులు, పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. వారం క్రితం వరకు ప్రజల మధ్య ఉంటూ ఆశావహులు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహించారు. కొద్ది రోజులుగా ఇరు పార్టీల ఆశావహులు అందుబాటులో లేకుండా పోయారు. కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు కావడంతో ఇక్కడి రాష్ట్ర నాయకులు మొదలు, ఢిల్లీలోని జాతీయ నాయకుల ప్రాపకం కోసం ఆశావహులు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో కేవలం బీఆర్ఎస్ నాయకుల సందడి మాత్రమే కనిపిస్తుంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినందున నేడో రేపో అభ్యర్థిత్వం ఖరారు చేసుకున్న మీదట మాత్రమే ప్రచారాలు ముమ్మరం చేయాలని యోచనలో ప్రత్యర్థి పార్టీల నాయకులు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.



ఎవరి ధీమా వారిదే..

రాష్ట్రం ఏర్పాటుకు ముందు రెండుమార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుగౌడ్ విజయం సాధించారు. ఈ మారు అధికార పార్టీ పనితీరు పట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతుందని, ఇలాంటి పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని బీఆర్ఎస్‌కు గట్టి పోటీ ఇస్తామని రెండు పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత రెండు శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీ అభ్యర్థులు బీఆర్ఎస్‌కు సమీప ప్రత్యర్థులుగా నిలిచారు. 2018 ఎన్నికల్లో మాత్రం బీజేపీ అభ్యర్థిగా పోటీచేసిన బండపల్లి సతీష్ మూడో స్థానానికి చేరుకున్నారు. అయితే గత ఎన్నికల్లో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఐదు డివిజన్లలో బీజేపీ అభ్యర్థులు అధికార పార్టీకి గట్టిపోటీ ఇచ్చి రెండవ స్థానంలో నిలిచారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో బలమైన శక్తిగా బీజేపీ స్థానాన్ని పదిలం చేసుకుంది. జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన శాసనసభ ఎన్నికల్లో తాము మాత్రమే బీఆర్ఎస్‌ను గద్దెదింపగలమని బీజేపీ నాయకులు సవాళ్లు విసురుతున్నారు. మరోవైపు తమ పార్టీ సరైన అభ్యర్థులను పోటీలో దింపని కారణంగానే బీజేపీ రెండవ స్థానానికి ఎగబాకిందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఇక్కడి మైనారిటీ, క్రైస్తవుల మద్దతులో బీఆర్ఎస్‌ను సునాయసంగా ఓడిస్తామని, బీజేపీ మూడో స్థానానికి పరిమితం కావాల్సిందేనని కాంగ్రెస్ నాయకులు ధీమాలో ఉన్నారు.

డజనుకు పైగా ఆశావహులు

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి డజన్‌కు పైబడిన నాయకులు టికెట్లు ఆశిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి ఆదం సంతోష్‌కుమార్, నోముల ప్రకాశ్‌రావు, దీపక్ జాన్, నాగులూరి సాయిబాబా టికెట్ చేజిక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి పలువురు టికెట్‌లు ఆశిస్తున్నప్పటికీ ప్రధానంగా బండా కార్తీకారెడ్డి, మేకల సారంగపాణి, మద్దెర్ల శ్యాంసుందర్‌తో పాటు గత శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన బండపెల్లి సతీష్ సైతం టికెట్ ఆశిస్తున్నారు. రెండు పార్టీల్లో ఎవరికి టికెట్ లభించినా ఆశావహులు అందరు ఏకతాటి మీదకు వస్తే మినహా అధికార పార్టీ అభ్యర్థికి గట్టిపోటీ ఇచ్చే అవకాశాలు లేవు.

బీఆర్ఎస్ ప్రణాళిక సిద్ధం

ప్రత్యర్థి పార్టీల నాయకులు నేటికీ టికెట్ వేటలో తనమునకలవుతుండగా ఇవేవీ పట్టించుకోని బీఆర్ఎస్ మాత్రం సికింద్రాబాద్‌లో ఎన్నికల కార్యాలయాలు సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తాళం వేశారు. టీఆర్‌టీ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసుకున్న ఎన్నికల కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ఆసీనులు అవుతున్నారు. సీతాఫల్‌మండి టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో ఎన్నికల మెటీరియల్ కోసం ఒకటి, ప్రచార కార్యకలాపాల నిమిత్తం మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అడ్డగుట్ట ప్రాంతంలో మరో కార్యాలయం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పేర్లు ఖరారు తర్వాతే నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాలు జోరందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జంగ్ తెలంగాణ 2023

చర్చనీయాంశం .. శ్రీగణేశ్ వ్యవహారం

మళ్లీ కాంగ్రెస్ గూటికి..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్‌కు సీనియర్ నేత ఎన్. శ్రీగణేశ్ కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. శ్రీగణేశ్ కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆ పార్టీలో టికెట్ పరిణామాలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. కాంగ్రెస్ నుంచి ఆయనకు టికెట్ కేటాయింపుపై స్పష్టత వచ్చాకే పార్టీలో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి శ్రీగణేశ్ పార్టీ మారడం కంటోన్మెంట్ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

మూడో ప్రయత్నం

తొలినాళ్లలో మాజీ మంత్రి గీతారెడ్డి అనుచరుడిగా కొనసాగిన శ్రీగణేశ్, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవి దక్కించుకున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించినా దక్కలేదు. అయినా అదే పార్టీలో కొనసాగుతూ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నించారు. అధిష్ఠానం సర్వే సత్యనారాయణకు టికెట్ ఖరారు చేయడంతో, బీజేపీలో చేరి ఎన్నికల్లో పోటీ చేశారు. 2019 పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సాయన్న మరణానంతరం బీఆర్ఎస్ టికెట్ పరిశీలనలో ఆయన పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. తీరా సాయన్న కుమార్తె లాస్యకు కేటాయించడంతో శ్రీగణేశ్ మళ్లీ ప్రత్యామ్నాయ బాట పట్టారు. గత వారం బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని కలిసిన ఆయన మూడు రోజుల క్రితం లాస్య నందితతో కలిసి కేటీఆర్ కలిశారు. మరుసటి రోజు నేరుగా గాంధీభవన్‌కు వెళ్లి రేవంత్ రెడ్డిని కలిశారు. ఆయనతో చర్చలు సఫలీకృతం కావడంతో కాంగ్రెస్‌లో చేరికకు గ్రీన్ సిగ్నల్ లభించింది. గురువారం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరడంతో ఆయనకు టికెట్ కేటాయింపు లాంఛనమే అని ప్రచారం సాగుతోంది.



రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీగణేశ్

మా చెల్లిని ఆశీర్వదించండి

రసూల్‌పురా: తమ తండ్రి బాటలో నడుస్తూ నియోజకవర్గ వాసులకు నిరంతరం అందుబాటులో ఉంటామని తన చెల్లిని భారీ మెజార్టీతో గెలిపించాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు మద్దతుగా అక్క నివేదిత గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఏడో వార్డులో బోర్డు మాజీ సభ్యులు పి. శ్యామ్‌కుమార్, భాగ్యశ్రీ ఆధ్వర్యంలో ఇన్‌ఫాంట్ జీసస్, ఎస్బీ కాలనీల్లో లాస్యకు మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహించి మద్దతు కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన తన తండ్రి దివంగత ఎమ్మెల్యే జి. సాయన్నకు వెన్నంటి ఉన్నట్లే తనకు అండగా ఉండి ఈ సారి జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని లాస్యనందిత కోరారు. మూడవ వార్డులో బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈద్గా అంబేద్కర్‌నగర్‌లో గురువారం ప్రచారం చేస్తూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానని లాస్య హామీ ఇచ్చారు. ప్రచారంలో వార్డు అధ్యక్షులు తేజ్‌పాల్, ఉపాధ్యక్షులు యశ్వంత్‌కుమార్, రాజారెడ్డి, వేణుగోపాల్, విజయ్. ఉమేష్, దుర్గాప్రసాద్, మేరీ, వీరమణి, సంధ్య వనజ, ప్రమీల శకుంతల పాల్గొన్నారు.



లాస్యకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నివేదిత

తలసాని శ్రీనివాస్ యాదవ్‌కే మా మద్దతు



మద్దతు తెలుపుతున్న సిక్కు సొసైటీ సభ్యులు

సనత్‌నగర్: నిత్యం ప్రజల కోసం తపిస్తూ వారి బాగోగులను చూసుకుంటున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కే తమ మద్దతు ఉంటుందని అమీర్‌పేట సిక్కు సొసైటీ ప్రతినిధులు ప్రకటించారు. ఈ మేరకు నిర్వహించిన సొసైటీ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించిన అనంతరం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మంత్రి నివాసానికి వెళ్లి ఆయనకు మద్దతు ప్రకటించారు. నియోజకవర్గ ప్రజలంతా తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెంటే ఉన్నారని, భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్ సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయా సమస్యలన్నీ పరిష్కరిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. కంటోన్మెంట్ ఆరోవార్డు పరిధిలోని జవహార్ రైల్వే, జూపిటర్ కాలనీల్లో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. తన తండ్రి ఎమ్మెల్యేగా కొనసాగిన సమయంలో ఆయా కాలనీల్లో బోర్‌వెల్స్ ద్వారా తాగునీటి సదుపాయం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. తనను గెలిపిస్తే కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంజయ్ బాబు, మునిరత్నం, శాంతి కిరణ్, రామ్‌జీవన్ సాబ్, కృష్ణ, శేష్ రాజ్, పార్థు, భారతి, మహేశ్ అగర్వాల్, సోంబాబు, వెంకట్‌రామన్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న లాస్య నందిత

'ఆరు హామీలతో' కాంగ్రెస్‌పై మరింత నమ్మకం



ప్రచారం చేస్తున్న రవీందర్‌గౌడ్



ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు హామీలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడిందని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని రాంగోపాల్‌పేట్, సుభాష్‌రోడ్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేఖ విధానాలతో ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని ఈ సారి ఆ పార్టీని ఓడించి గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మణిమాల, సయిద్ ఖాన్, రామచందర్, విజయ, మానస పాల్గొన్నారు.

బ్రాహ్మణవాడీలో..

సనత్‌నగర్: కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆ పార్టీ సీనియర్ నేత నాగేందర్‌రాజ్ ఆధ్వర్యంలో గురువారం బేగంపేట బ్రాహ్మణవాడీలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉంటారని ఈ సందర్భంగా ఆయన వివరించారు.

ఆర్మీ అధికారి ఇంట్లో దోపిడీకి యత్నం

ఒకరి రిమాండ్, పరారీలో ఒకరు



పట్టుబడ్డ సమీర్



సీసీ కెమెరాల్లో సమీర్, శివ

సనత్‌నగర్: ఆర్మీ అధికారి ఇంట్లో దోపిడీకి యత్నించిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్సార్టీకాలనీలోని 1049 నెంబర్ ఇంట్లో ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్న అభిషేక్ కుటుంబం నివాసముంటుంది. అభిషేక్ విధి నిర్వహణలో భాగంగా అస్సాంలో ఉంటుండగా ఇంట్లో అతని తల్లి ప్రేమ (60) ఉంటుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉంటున్న ప్రేమ ఈ నెల 9న తాళం వేసి బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఢిల్లీకి చెందిన సమీర్, శివ సమీపంలోనే ఉండి ఇదంతా గమనించారు. ప్రేమ బయటకు వెళ్లగానే ఇనుపరాడ్‌తో తలుపు గడియ విరగ్గొట్టి ఇంట్లో చోరీకి పాల్పడుతుండగా అలికిడి కావడంతో మొదటి అంతస్తులో ఉంటున్న ప్రేమ సోదరుడు లక్ష్మీనారాయణ (70) అక్కడికి వచ్చి కేకలు వేస్తూ దొంగలను అడ్డుకున్నాడు. ఈ క్రమంలో దొంగలు అతన్ని వెనక్కి నెట్టేయడంతో గాయపడ్డాడు. అదే సమయంలో ఇంట్లోనే ఉన్న లక్ష్మీనారాయణ కుమారుడు అశోక్ అక్కడికి చేరుకుని నిందితుల్లో ఒకడైన సమీర్‌ను పట్టుకున్నాడు. స్థానికులు కూడా అప్రమత్తమై సంఘటన స్థలానికి వచ్చారు. శివ పరారవ్వగా సమీర్‌ను అప్పగించగా రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న మరొకరి కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ తెలిపారు.

క్లుప్తంగా...

నేడు 'ఎన్నికల సంస్కరణల'పై సెమినార్

లాలాపేట: ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో శుక్రవారం సిటీ కళాశాల ఆడిటోరియంలో 'ఎన్నికల సంస్కరణలపై సెమినార్'ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డా. పి. మోహన్‌రావు, టంగుటూరి శ్రీరామ్, రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సెమినార్‌కు మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు, మాజీ ఆర్టీఐ కమిషనర్ ఆర్. దిలీప్ రెడ్డి, పి.ఉదయభాస్కర్, రచనా జర్నలిజం కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. ఉమామహేశ్వరరావు హాజరవుతారన్నారు.

ముదిరాజ్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలి

లాలాపేట: త్వరలో జరుగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్‌లకు జనాభా దామాషా ప్రకారం సముచితమైన ప్రాధాన్యం ఇవ్వాలని మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సుక్క గణేష్ ముదిరాజ్ బీజేపీ అధిష్ఠానాన్ని కోరారు. ఇటీవల అదిలాబాద్‌లో జరిగిన జనగర్జన సభ విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం కేంద్ర మంత్రి అమీత్‌షాను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నుంచి తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

చిలకలగూడ: చిలకలగూడ ప్రధాన రహదారిలో తరుచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి కేఎం ప్రభుగుప్తా కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. చిలకలగూడ నుంచి జామై ఉస్మానియాకు వెళ్లే ప్రధాన రహదారిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగి చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులు గాయాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలగూడ గాంధీ విగ్రహం, మైలార్‌గడ్డ బ్యాంక్ ఆఫ్ బరోడా, సీతాఫల్‌మండి చౌరస్తా, నామాలగుండు, వారాసిగూడ తదితర ప్రాంతాలను యాక్సిడెంట్ జోన్లుగా గుర్తించి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు.

వెంకటేష్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ గణితశాస్త్రం విభాగం నుంచి దుడుక వెంకటేష్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. సికింద్రాబాద్ పరిధిలోని పార్శిగుట్ట శ్రీనివాస్‌నగర్ నివాసి వెంకటేష్ ఓయూ అధ్యాపకులు ప్రొ.నాగరాజు పర్యవేక్షణలో ఎగ్జిస్టెన్స్ అండ్ యూనిక్ నెస్ ఆఫ్ ఫిక్స్ అండ్ కామన్ ఫిక్స్ పాయింట్ ఫర్ డిఫరెంట్ కాంట్రక్షన్ ఇన్ వేరియస్ స్పేసెస్ అనే అంశం పై పరిశోధనకు డిగ్రీ అందుకున్నారు. హన్మకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం విభాగం అధ్యాపకులుగా పనిచేస్తూ హెడ్ పదవీలో కొనసాగుతున్నారు.

ఆటపాటలతో నిరుద్యోగ బతుకమ్మ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి నిరుద్యోగ బతుకమ్మను ఆటపాటలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థి నిరుద్యోగ అక్కా చెల్లెళ్ల బతుకమ్మకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. బతుకమ్మ పాటలతో ఉద్యోగా ల కల్పనలో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న రఘుపతిరావు

లాలాపేట: యాక్షనైడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరానగర్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ హైదరాబాద్ ఇన్‌చార్జి చెవ్వం రఘుపతిరావు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు ప్రభుత్వాలు కల్పిస్తున్న విద్యా సంస్థల్లో చేరి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలన్నారు. యాక్షనైడ్ సంస్థ ఆధ్వర్యంలో గత కరోనా కాలంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. స్థానిక బస్తీల నాయకులు సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు, కూరెల్లి నాగరాజు గౌడ్, పర్మేష్, జునైద్, కళ్యాణి పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

రాంగోపాల్‌పేట్: నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక డిజిటల్ పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయులు చిన్నా బత్తిని శౌరి అన్నారు. గురువారం పాఠశాలలో సనాతన్ ట్రస్టు ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీ ఎస్వీ సుబ్రహ్మణ్యం సతీమణి పద్మశ్రీ సంస్మరణార్థం 350 మంది విద్యార్థులకు ఉచితంగా బూట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గతంలో మంచుకొండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డిజిటల్ తరగతి గదులు, ఫర్నిచర్, పుస్తకాలు తదితర సామగ్రి అందించి ఎంతో సహకరించారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు కాన్వెంట్లకు తీసిపోకుండా అత్యుత్తమ ఆంగ్ల విద్యా బోధన చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఒకటవ తరగతి విద్యార్థి ఆంగ్లంలో వినిపించిన ప్లెడ్జ్ మరో విద్యార్థి జైలోఫోన్ ఇన్‌స్ట్రుమెంట్ ద్వారా ప్రదర్శించిన సంగీతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సుబ్రహ్మణ్యం, సందెపూడి సత్యనారాయణ, డాక్టర్ బాలా త్రిపుర సుందరి పాల్గొన్నారు.



విద్యార్థులకు బూట్లు అందిస్తున్న దృశ్యం



అడ్డగుట్టలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేసి ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. –అడ్డగుట్ట

రైలులో గంజాయి తరలిస్తున్న నలుగురి రిమాండ్



సనత్‌నగర్: రైలులో గంజాయి తరలిస్తున్న నలుగురిని రిమాండ్‌కు తరలించిన ఘటన బేగంపేట రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. భువనేశ్వర్-ముంబాయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బేగంపేట రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలును జిల్లా అధికారి సీహెచ్.విజయ్ ఆధ్వర్యంలో సోదాలు జరిపారు. బీ-4 బోగిలో ప్రయాణిస్తున్న పుణెకు చెందిన హఫీజ్ నజీర్ షేక్, (27), రంజాన్‌ఆదం పటేల్ (32), చందులాల్ లక్ష్మణ్ బైనాడే (34), అన్సారీ గులామ్ గంపనూర్ కయాముద్దీన్ (24)లను తనిఖీ చేయగా 61 కిలోల గంజాయి లభించింది. తనిఖీల్లో నాంపల్లి ఎక్సైజ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సుధాకర్‌వర్మ, హైదరాబాద్ డీటీఎఫ్ సీఐ కరుణ, ఎస్ఐ సంపత్‌కుమార్, జీఆర్‌పీ సీఐ ఆరెల్ల శ్రీనివాస్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రవిబాబు, ఎస్ఐ నసీమాబేగం పాల్గొన్నారు.

కస్టడీలో ఉన్న నిందితుడు పరారైనట్లు వార్తలు

- అదేమీ లేదని కొట్టిపారేసిన పోలీసులు

సనత్‌నగర్: ఎస్ఆర్‌నగర్ పోలీసుల కస్టడీలో ఉన్న ఓ నిందితుడు పారిపోయాడనే వార్త గురువారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండగా పోలీసులు మాత్రం ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని కొట్టిపారేశారు. ఎస్ఆర్‌నగర్ క్రైమ్ సిబ్బంది విధులను డీఐ సీహెచ్.రఘురాములు పర్యవేక్షిస్తున్న సమయంలో ఓ నిందితుడు అదును చూసి పారిపోయాడని, వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిందితుడిని పట్టుకున్నారనే సందేశాలు సోషల్ మీడియాలో వచ్చాయి. దీనిపై డీఐ స్పందిస్తూ ఇదంతా అవాస్తవమని చెప్పారు. ఇన్‌స్పెక్టర్ రామప్రసాదరావు దీనిపై వివరణ ఇస్తూ సెల్‌ఫోన్ చోరీ కేసులో విచారణకు తీసుకువచ్చిన ఓ నిందితుడు రెండో అంతస్తు నుంచి కిందికి దిగి అక్కడే కూర్చున్నాడని తెలిపారు. నిందితుడు పారిపోయాడని కొందరు ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు.

మంత్రులకు అడ్డా.. సనత్‌నగర్ గడ్డ

- నాటి ముఖ్యమంత్రిగా మర్రిచెన్నారెడ్డి ఆ తర్వాత మంత్రులుగా శ్రీపతి రాజేశ్వర్, మర్రి శశిధర్‌రెడ్డి
- ప్రస్తుత కేబినెట్‌లో తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: రాష్ట్రానికి ముఖ్యమంత్రిని అందించిన చరిత్ర సనత్‌నగర్ నియోజకవర్గానిది. ఒకప్పుడు ఖైరతాబాద్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండే సనత్‌నగర్ 1978లో ప్రత్యేక నియోజకవర్గంగా అవతరించింది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిథ్యం వహించారు. 2009 ఎన్నికలకు ముందు డీలిమిటేషన్‌లో నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాలు (ఫతేనగర్, బేగంపేట్ పార్ట్) కూకట్‌పల్లి నియోజకవర్గంలో కలపగా సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, బోయిగూడ ప్రాంతాలు సనత్‌నగర్‌లో కలిశాయి. మర్రి శశిధర్‌రెడ్డి మూడుసార్లు, శ్రీపతి రాజేశ్వర్ రెండు సార్లు, తలసాని శ్రీనివాస్‌యాదవ్ రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ నియోజకవర్గం నుంచి గతంలో ప్రాతినిథ్యం వహించిన మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి, శ్రీపతి రాజేశ్వర్, మర్రి శశిధర్‌రెడ్డితో పాటు గత రెండు పర్యాయాలు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంత్రులుగా పనిచేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో సనత్‌నగర్ ఓ భాగంగా ఉంది. మాస్, క్లాస్ కలయికతో ఈ నియోజకవర్గం ఆవరించి ఉంది. కార్మికులు, శ్రామికులు, వ్యాపారులు, విద్యావంతులు, పారిశ్రామికవేత్తలు ఇలా అన్ని వర్గాల వారు ఇక్కడ కనిపిస్తారు.

- మున్సిపల్ డివిజన్లు: సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్, మోండా (పార్ట్)
- రెవెన్యూ మండలాలు: బాలానగర్, అమీర్‌పేట్, సికింద్రాబా ద్, ముషీరాబాద్, ఖైరతాబాద్.
- జీహెచ్‌ఎంసీ సర్కిళ్లు: ఖైరతాబాద్ సర్కిల్-17, బేగంపేట సర్కిల్-30
- ప్రధాన ఏరియాలు: ఎస్పీరోడ్డు, మహంకాళి స్ట్రీట్, పాటిగడ్డ, పార్క్‌లేన్, క్లాక్ టవర్, జేమ్స్ స్ట్రీట్, ఆర్పీరోడ్డు, సుభాష్‌రోడ్డు, మోండా మార్కెట్, సంజీవరెడ్డి నగర్, అమీర్‌పేట్, బల్కంపేట్, బన్సీలాల్‌పేట్, బేగంపేట్, ఓల్డ్ గ్యాస్‌మండీ.

మొత్తం ఓటర్లు	2,44,946
పురుషులు	1,27,436
స్త్రీలు	1,17,502
ఇతరులు	8
మొత్తం పోలింగ్ బూత్‌లు	229
జనాభా	ఐదు లక్షల పైచిలుకు..

నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఎన్నికైన శాసనసభ్యుల వివరాలు

సంవత్సరం	ఎమ్మెల్యేగా గెలిచిన వారు	పార్టీ
1978	శీలం రాందాస్	కాంగ్రెస్
1983	కాట్రగడ్డ ప్రసూన	టీడీపీ
1985	శ్రీపతి రాజేశ్వర్	టీడీపీ
1989	మర్రి చెన్నారెడ్డి	కాంగ్రెస్
1994	మర్రి శశిధర్‌రెడ్డి	కాంగ్రెస్
1999	శ్రీపతి రాజేశ్వర్	టీడీపీ
2004	మర్రి శశిధర్‌రెడ్డి	కాంగ్రెస్
2009	మర్రి శశిధర్‌రెడ్డి	కాంగ్రెస్
2014	తలసాని శ్రీనివాస్‌యాదవ్	టీడీపీ
2018	తలసాని శ్రీనివాస్‌యాదవ్	బీఆర్ఎస్